క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని జిల్లా సహకార శాఖ అధికారిణి (డీసీఓ)గా నూతనంగా నియమితులైన సుధాభారతి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి పూలమొక్క అందజేశారు.

బీజేవైఎం ధర్నా

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి రాష్ట్రంలోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ బీజేవైఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామన్నారు. సంఘ నాయకులు శీనయ్య, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి రిజర్వాయర్‌ను కాపాడాలని వినతి

నెల్లూరు(అర్బన్): కనిగిరి రిజర్వాయర్‌ను కాపాడాలని కోవూరు నియోజకవర్గ టీడీపీ నాయకుడు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ కూర్మనాథ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కనిగిరి రిజర్వాయర్ దక్షిణ భాగంలో రిజర్వాయర్‌కు రక్షణగా పెద్ద తిప్ప ఉందన్నారు. కొందరు అక్రమార్కులు అధికారులకు మామూళ్లు ఇచ్చి కొండను తవ్వి గ్రావెల్, రాళ్లను తరలిస్తున్నారని ఆరోపించారు. ఫలితంగా రిజర్వాయిర్ రక్షణ కట్ట కరిగిపోయిందన్నారు. రిజర్వాయర్‌లో నీటిని నిల్వ ఉంచితే రెండుగ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకునే ప్రమాదం ఉందన్నారు. పరిశీలించి బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరారు.

నేత్రదానం

కోవూరు(విడవలూరు) : విడవలూరుకు చెందిన కంచర్ల వెంకమ్మ (70) అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యుల ఆమోదంతో మృతురాలి నేత్రాలను మనసేవా సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరు ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల ల్యాబ్ టెక్నీషియన్ లాలేష్, బాలాజీ సోమవారం సేకరించారు. నేత్రదాతలను సంస్థ నిర్వాహకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి అభినందించారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ



పొదలకూరు : మండలంలోని నావూరు జెడ్పీ హైస్కూల్‌లోని విద్యార్థులకు సోషల్ టీచర్ ఎన్ శ్రీనివాసులు పరీక్ష ప్యాడ్లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్నట్లు వివరించారు.

దళారులను ఆశ్రయించొద్దు

మనుబోలు : రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రజలు దళారులను ఆశ్రయించొద్దని తహసీల్దార్ లక్ష్మీనారాయణ అన్నారు. మనుబోలు తహసీల్దార్‌గా ఉన్న సుధీర్ ఇటీవల బదిలీపై వెళ్లడంతో లక్ష్మీనారాయణ నూతన తహసీల్దార్‌గా రెవెన్యూ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టపరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట డీటీ బాలకోటమ్మ, ఆర్ఐ శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

నేత్రపర్వం.. సీతారాముల కల్యాణం



మనుబోలు : శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణం, గ్రామోత్సవాన్ని మనుబోలు పడమటి వీధిలో ఆదివారం అర్ధరాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత అర్చకుడు కుమారస్వామి సీతారాములకు అభిషేకాలు జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. వేదమంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అనంతరం సీతారాముల గ్రామోత్సవం వేడుకగా సాగింది. ఉచ్చూరు లక్ష్మీనరసారెడ్డి -తనూజమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

శాస్త్రోక్తంగా ఏకాంతసేవ

కోదండరామపురం రామాలయంలో సీతారాములకు ఏకాంతసేవను ఆదివారం రాత్రి అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొమ్మిది రకాలు స్వీట్లు, పండ్లను నూతన దంపతులకు నైవేద్యంగా సమర్పించారు. దువ్వూరు సుధాకర్‌రెడ్డి-రాజేశ్వరమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నేత్రపర్వంగా వేణుగోపాలుడికి చక్రస్నానం





నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం బ్రహ్మోత్సవాలతో అలిసిపోయిన స్వామివారికి చక్రస్నానాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. రాత్రి దేవదేవేరులను విశేషంగా అలంకరించి ఏకాంతసేవను వేడుకగా నిర్వహించారు. చక్రస్నానానికి విరుపావరుల గిరికృష్ణ,సంయుక్త దంపతులు, ఏకాంతసేవకు సన్నపురెడ్డి సుకన్య, సన్నపురెడ్డి సుధాకర్‌రెడ్డి, సుమన ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ డీ చంద్రశేఖర్‌రావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్, వ్యవస్థాపక ధర్మకర్త మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముగిసిన మల్లేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి ఏకాంత సేవతో ముగిశాయి. చివరి రోజు భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామిని విశేషంగా అలంకరించి ఏకాంతసేవను వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా గుండ్లపల్లి అరవింద్‌కుమార్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వంగాల శ్రీనివాసులురెడ్డి, ఈఓ ఎస్ నవీన్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సజ్జాపురంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు



14వ డివిజన్‌లో..

నెల్లూరు రూరల్: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని సజ్జాపురంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి స్థానిక నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పథకాల కొనసాగింపునకు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారాయణ, ఉపసర్పంచ్ కొండయ్య, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 14వ డివిజన్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నేతలతో కలసి ఏసీనగర్ ప్రాంతంలోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా కర్తం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పాలనపై సంతృప్తి చెందిన ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి



నెల్లూరు(టౌన్): అసెంబ్లీలో ప్రదర్శించిన ఖాళీలన్నింటిని భర్తీ చేయాలని డీఎస్సీ-98 అభ్యర్థుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ గంగా భవానికి సోమవారం వినతి పత్రం అందజేశారు. జిల్లాలో 201 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తున్నారన్నారు. తమ పోరాటాన్ని అర్థం చేసుకుని మిగిలిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు.

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

నెల్లూరు(బారకాసు): స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని మేయర్ స్రవంతి, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. నగర ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత శాఖల అధికారులకు అర్జీలను అందజేసి నిర్దేశించిన గడువులోగా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఆరోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ సంపత్‌కుమార్, మేనేజర్ ఇనయతుల్లా, టీపీఆర్వో ప్రసాద్, పట్టణ ప్రణాళిక విభాగాధికారి దశయ్య, తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారు పాస్‌పుస్తకాల మంజూరుకు వినతి



మాట్లాడుతున్న పెయ్యలపాళెంవాసులు

నెల్లూరు(అర్బన్): తాము 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న సుమారు 47 ఎకరాల భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని కొడవలూరు మండలం పెయ్యలపాళెం అరుంధతీయులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ కూర్మనాథ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన యానాదయ్య మాట్లాడుతూ తనతో పాటు 74 మంది బొడ్డువారిపాళెం రెవెన్యూ డివిజన్ పరిధిలోని భూములను సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఏళ్ల తరబడి పట్టాదారు పాసుపుస్తకాల కోసం తహసీల్దార్ చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వ భూములంటూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తాము కోర్టుకు సైతం వెళ్లి ఉన్నామన్నారు. అందువల్ల అధికారులు స్పందించి తమకు పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుల్లయ్య, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లను నెరవేర్చే వరకు ఆందోళన



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఏపీజేఏసీ అమరావతి నాయకులు

నెల్లూరు(అర్బన్): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల డిమాండ్లను నెరవేర్చే వరకు ఆందోళనను కొనసాగిస్తామని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల డిమాండ్లపై కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ కూర్మనాథ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం నల్లబ్యాడ్జీలతో కలెక్టరేట్ ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అల్లంపాటి మాట్లాడుతూ ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి మంగళవారం సెల్‌డౌన్, 12న కలెక్టరేట్ వద్ద ధర్నా, 15న మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు పరామర్శ, 18న సీపీఎస్ ఉద్యోగుల సమస్యలపై కలెక్టరేట్ వద్ద ధర్నా, 20న బ్యాంకర్లను కలిసి ఈఎంఈల చెల్లింపులపై ఒత్తిడి తేవద్దని, జరిమానా విధించవద్దని, 25న కలెక్టరేట్ వద్ద అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా, 29న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపై కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘ నాయకులు మురళి, శరత్‌బాబు, చెంచురామయ్య, రమేష్, రాజేష్, కృష్ణచైతన్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

నెల్లూరు(క్రైమ్): ఎడ్ల బండిని కారు ఢీకొనడంతో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు...హరనాథపురం రెండోవీధికి చెందిన వెంకటరెడ్డి ఎడ్ల బండిపై రోజూ పొలం పనులకు వెళ్లి వస్తుంటాడు. సోమవారం వేకువన రోజులాగే పొలానికి వెళ్లారు. అక్కడ పనులు పూర్తి చేసుకుని ఎడ్ల బండిపై ఇంటికి బయలుదేరారు. నారాయణ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో జాతీయరహదారిని దాటుతుండగా చెన్నై నుంచి కావలి వైపు వెళుతున్న కారు వేగంగా ఎడ్ల బండిని ఢీకొంది. ఎడ్ల బండి రోడ్డుపక్కగా పడిపోగా వెంకటరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. కారుడ్రైవర్ కారును అక్కడే వదిలి పరారయ్యాడు. 108 సిబ్బంది క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో అపహరణపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఇంటి ముందు నిలిపి ఉంచిన ఆటో అపహరణకు గురైన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..ప్రశాంతినగర్‌కు చెందిన సుధాకర్ ఆటోడ్రైవర్. ఆదివారం ఆయన తన ఆటోను ఇంటిముందు పార్క్‌చేసి ఉండగా గుర్తుతెలియని దుండగులు అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు.

వేధింపులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): వివాహితను వేధింపులకు గురిచేసిన భర్త, అత్తింటివారిపై పోలీసులు కేసునమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు...నవాబుపేటకు చెందిన వెంకటేశ్వర్లు, హేమలత దంపతులు. వెంకటేశ్వర్లు తన కుటుంబసభ్యులతో కలిసి గత కొంతకాలంగా భార్యను అదనపు కట్నం కోసం వేధించసాగారు. వారి వేధింపులు భరించలేని భార్య సోమవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

నెల్లూరు(క్రైమ్): బైక్ అదుపుతప్పడంతో ఇద్దరు విద్యార్థులు గాయపడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలు..ప్రశాంతినగర్‌కు చెందిన ఏ పవన్‌కుమార్, ఎస్ పవన్‌కుమార్ పదోతరగతి విద్యార్థులు. సోమవారం వారు విజయమహల్‌గేటు సమీపంలోని ఓ పాఠశాలలో పదోతరగతి పరీక్ష రాసేందుకు బైక్‌పై ఇంటి నుంచి బయలుదేరారు. ఆత్మకూరుబస్టాండ్ ఫ్లైఓవర్‌బ్రిడ్జి వద్దనున్న సాయిబాబాగుడి సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పడంతో రోడ్డుపై పడి ఇద్దరి తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు హుటాహుటిన చికిత్స నిమిత్తం అపోలో ఆస్పత్రికి తరలించారు. నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● ఇఫ్తార్ విందు



పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నగరంలోని 44వ డివిజన్ శిఖరంవారివీధిలోని జుమ్మా మసీదులో నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్‌యాదవ్ సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్, కార్పొరేటర్లు నీలిరాఘవ, షేక్ కరీముల్లా, వేలూరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

-నెల్లూరు(బృందావనం)

కనులపండువగా ఏకాంతసేవ



నెల్లూరు(బృందావనం): బారకాసులోని శ్రీరామ మందిరంలో జరుగుతున్న నవమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ఏకాంత సేవను కనులపండువగా నిర్వహించారు. సీతారాములను విశేషంగా అలంకరించి ఏకాంత సేవను వేడుకగా నిర్వహించారు. అమ్మవారి కానుకగా భక్తులకు పసుపు, కుంకుమ, జాకెట్లు అందజేశారు. ఉభయకర్తలుగా చాకిరాల శ్రీధర్, అపర్ణ, పద్మావతి, వంశీ దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్షుడు చాకిరాల శేషయ్య, సభ్యులు సీ హనుమంతరావు, ఎస్ సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా గజ వాహనోత్సవం



నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం తీర్థవాది, పట్టాభిషేకం, రాత్రి గజ వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా నారాయణ ,ఇందిర, కే లక్ష్మీనరసింహం, మణెమ్మ, కే మనోహర్‌కుమార్, శ్రీదేవి దంపతులు వ్యవహరించారు. ఆలయ ఈఓ జీ దర్గయ్య ధర్మకర్తల మండలి చైర్మన్ వైవీ రమణకుమార్, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కూచిపూడి నృత్య కళాకారులకు సన్మానం



బాలికలను సన్మానిస్తున్న నిర్వాహకులు

మనుబోలు : మండలంలోని మడమనూరు గ్రామానికి చెందిన కూచిపూడి నృత్య కళాకారులను శ్రీశ్రీ కళావేదిక వారు సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో ఆదివారం రాత్రి జరిగిన ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో మడమనూరుకు చెందిన పృథ్వీ పూర్ణిమ, చేవూరి పావని సులక్షిత, ప్రియదర్శిని తమ నాట్య ప్రతిభను ప్రదర్శించారు. దీంతో శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌తో పాటు పలువురు ప్రముఖులు బాలికలకు షీల్డులు అందజేసి సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. దీంతో బాలికలను గ్రామస్తులు సోమవారం అభినందించారు.

నిత్యాన్నదానానికి నగదు విరాళం



అన్నదానానికి నగదు అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి దాతలు సోమవారం విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ అమెరికాకు చెందిన పుచ్చలపల్లి వినయ్‌కుమార్‌రెడ్డి, రాజేశ్వరమ్మ పేర్ల మీద దొడ్ల జానకమ్మ రూ.20 వేల నగదు అందజేసినట్లు తెలిపారు. అలాగే బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన చేవూరు వినోద్‌కుమార్,ఉమాలత దంపతులు రూ.5,116 అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ వెంకటసుబ్బయ్య, పాలకమండలి సభ్యులు గుమ్మా రఘురామయ్య, గుంటూరు కామేశ్వరమ్మ పాల్గొన్నారు.

● బతుకు చిత్రం





నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు వద్ద సందర్శకుల ఫొటోలను స్పాట్‌లో చిత్రించి అందజేస్తూ మన్ననలు అందుకుంటున్నాడు పోలీసు కాలనీకి చెందిన కళాకారుడు సాయిరాం. గత ఐదేళ్లుగా కోరిన వారికి తమ రూపంతో ఉండే చిత్రాలను పెన్సిల్‌తో చిత్రించి ఇస్తూ జీవనోపాధి పొందుతున్నాడు .

-సాక్షి, ఫొటోగ్రాఫర్, నెల్లూరు